

కథా నిలయం
శ్రీకాకుళం

# 1
# చిట్టచివరి రేడియోనాటకం

రికార్డింగ్ స్టూడియో చల్లగా, మెత్తగా, మంచు అడవుల మధ్య నడుస్తున్నట్లుగా వుంది. "వెల్‌కమ్!" మెల్లగా గొంతు విప్పింది మాధవి. "స్టేజీ లేదు! కర్టెన్లు లేవు! రంగులు పులమటాలు, ముతక కంపు కొట్టే డ్రస్సింగులు లేవు! పేజీల కొద్దీ డైలాగులు, ప్రాంప్టింగులు లేవు! అసలీ నాటకానికి స్క్రిప్టే లేదు," క్షణంసేపు ఆపి వాళ్ళ వైపు చూసింది. నిర్లిప్తంగా, అపనమ్మకంగా వున్నాయి ఆ ముగ్గురి ముఖాలు. "వెనక్కు, గతంలోకి కాళ్ళు తగిలినంత మేరకు ప్రయాణిద్దాము! ఈ ప్రయాణమే మన నాటకానికి కథావస్తువు!"

ఉపన్యాస ధోరణిలో చెప్పుకుపోతోంది మాధవి. కుర్చీల్లో దిగవేసిన మూడు నిశ్శబ్దపు ముద్దల్లా, వాళ్ళలో పెద్దగా చలనం లేదు.

"ఇది నా చిట్టచివరి రేడియో నాటకం! ప్రెక్స్‌గా నా జీవితం చాలిస్తున్నాను. భ్రమలు విడిపోవటం! నిస్పృహ! ఇరవై ఆరేళ్ళ వయస్సు! ఏ ఎగ్జైట్‌మెంటు లేకుండా మామూలుగా బతకడానికి అంగీకరించని వయసు. కాలేజీ జీవితం ఇట్లాగే డిజెక్టెడ్‌గా, అనాసక్తంగా వుండేది. రేడియోల్లోకి దూకాను. ఇక్కడా అదే అనాసక్తత! పొరలుపొరలుగా ఎడారి ఇసుకమేటలు వేస్తున్నట్లుగా! నీరు అవసరం

లేని కాక్టస్ మొక్కలు మాత్రమే ఇక్కడ బతకగలవు! సారీ ఫర్ ది మోనోలాగ్! బాక్ టుది ఈవెంట్! ఒక నటి, ఒక రచయిత, ఒక ఫోక్ ఆర్టిస్టు, రేడియో ఆర్టిస్టుగా నేను, ఈ నాటకంలో మనం నలుగురం పాత్రలం! మన నాటకానికి మొదలు అంటూ లేదు. ముగింపు కూడా అవసరం లేదు! కాలపరిమితి అవటంతోటే ఆపేద్దాం! టేపు ముందుకు కదుల్తుంది! మనం వెనక్కు, వెనక్కు రివైండ్ అవుదాం! రెడీ! షల్ బిట్ స్టార్ట్! వుల్?

i

రెండు నిమిషాలు గడిచినా శబ్దం పెకిలి రాలేదు. టేపు నిశ్శబ్దంగా తిరుగుతోంది. గదిలో ఎ.సి. మిషన్ చప్పుడు మినహా మరే శబ్దంలేదు. ఇక తప్పదన్నట్లుగా నోరు విప్పింది పూర్ణమాణిక్యం, ఒకప్పటి పాపులర్ స్టేజి నటి.

"రేడియో స్టేషన్ దాకా వచ్చాడు శంకరం. డ్రాప్ చెయ్యడానికని తన కారు తెచ్చాడు. యాభై ఏళ్ళు దాటినా శంకరంలో వింత ఆకర్షణ! వృద్ధ కస్తూరీమృగంలా గుబాళిస్తుంటాడు. చెమటకంపు, ఖరీదైన సెంటు, సిగరెట్టు పొగ కలిసిన వింత వాసన.

"యాభై మూడు వారాల టీవీ సీరియల్ తీస్తున్నాడు శంకరం. డైలాగులు పలకటం రాని పిల్ల వెధవలందర్నీ వెంటేసుకొని దేశవాళీ మర్లోక్‌లాగా తిరుగుతుంటాడు. డి.డి. వన్‌లో ఒక మైథలాజికల్ సీరియల్‌కు అప్రూవల్ కూడా తెచ్చుకున్నాడు. ఈ శంకరం పాతికేళ్ళ క్రితం పల్లెల్లో కాంట్రాక్టు నాటకాలు ఆడే థర్డ్ రేట్ డైరెక్టరు. వాడి నాటకంలో వేషం వెయ్యమని చంపుకు తినేవాడు.

"డబ్బు ఆట్టే ఇవ్వకపోయినా ప్రేమగా చూసుకొనేవాడు. పెద్ద వేన్‌లో అందరం పాలోమంటూ వెళ్ళడం- వింత అనుభవం అది. ఏ రాత్రి పదికో మొదలవుతుంది వేడినీళ్ళ స్నానం. కోడి మాంసం, బంగళాలో వసతి. థ్రిల్‌గా వుండేవా రోజులు. భగభగ మండే నాటు సరుకు దొరికేది. మగవాళ్ళయితే ఫుల్ బాటిల్ లాగించేవాళ్ళు. ఆడవాళ్ళం ఒకటీ, అరా గ్లాసుల్తో సరిపెట్టుకొనేవాళ్ళం! స్టేజి ఎక్కేసరికి తూలిపోతుండేవాళ్ళం. మాటలు ముద్దగా వుండేవి. కూర్చున్న వాళ్ళల్లో ఎవడో ఒక లేకిమాట అనేవాడు. రోషం పొడుచుకువచ్చి అరవ సినిమాల్లో మాదిరి ఓవర్ యాక్టింగ్ చేసేవాళ్ళం! 'కొంచెం నైసుగా వుండండి, సరదాగా మాట్లాడండి!' అని పోరేవాడు కాంట్రాక్టరు. అదే ఈ శంకరం, డైలాగుల మధ్య బూతులు కలపమని, పబ్లిక్ శృంగారం కాస్త ఒలకబొయ్యమని వాడి ఉద్దేశం. 'వాడి పేడిమూతి చూస్తే డైలాగు పెకిలిరాదు. ఇంక శృంగారం ఎక్కడ పలుకుద్ది!' అని అరిచేదాన్ని భూషణాన్ని చూపిస్తూ. వాడే నిత్య హీరో మాకు. మేము నాటకాలు ఆడే రోజుల్లోనే లివరు జబ్బుతో పోయాడు భూషణం.

"శంకరాన్ని చాన్నాళ్ళపాటు దగ్గరకు రానివ్వలేదు. 'చూడు నీకోసం ఇంత చేస్తుంటే...' అన్నట్టుగుండేది అతని ముఖం. 'కొంచెం ఖలేజా పొగరూ చూపించు ఆఫీసులో. లేకపోతే ఆడంగి నాకొడకా అంటూ ఏ ఆడది దగ్గరకు రానివ్వదు,' అంటూ

ఉడికించేదాన్ని. సంవత్సరం కాంట్రాక్టు అయిపొవచ్చింది. నరసరావుపేటలో డ్రామా ఆడుతుండగా పోలీసుకేసులో ఇరుక్కున్నాను. కసిపట్టి ఒక పోలీసోడు అడల్టరీ కేసులో ఇరికించాడు. ప్రాణం పెట్టాడు ఈ శంకరం. ఎస్.ఐ. కాళ్ళు పట్టుకొని, డబ్బులు జల్లి బయటకు లాగేడు. కేసు నుండి బయటపడే లోపలే తన కోర్కె తీర్చుకున్నాడు పోలీసోడు. శరీరంపై రోత వేసింది. దిగులు బుట్టింది. ఎండ్రిన్ డబ్బా తెచ్చుకుంటేనో అనుకునేదాన్ని! తల్లిలా చూసుకున్నాడు శంకరం.

"శంకరానికి అప్పటికే పెళ్ళి అయింది. వాళ్ళ మామ బాగా పులిసున్నాడు. మా పెళ్ళికి పడనివ్వలేదు. అతనికి సెకండ్ సెటప్‌గానే వుండిపోయాను. అతనికో పిల్లను కూడా కన్నాను.

"పిల్లకు అయిదేళ్ళప్పుడు నారాయణరావు, 'మనం పెళ్ళి చేసుకుందాం!' అన్నాడు. నారాయణరావు గొప్ప అథర్. నేను వేసిన నాటకాలన్నీ ఆయన రాసినవే! ఒక ఫిలాసఫీ వున్న మనిషి! నాటకరంగం మీద భక్తి వున్న మనిషి! 'జగత్ కిలాడీలు', 'నువ్వే నా ప్రాణం' లాంటి చెత్త సరుకు రాయమని నోట్ల కట్టల్తో కాంట్రాక్టర్లు వచ్చే వాళ్ళు. రాయనుగాక రాయను అనేవాడు!

"అప్పట్లో శంకరం నాటకాల్ని వదిలి సినిమాల చుట్టూ తిరుగుతున్నాడు. డబ్బింగు సినిమాలు తీసే ఊపులో వున్నాడు. మా పెళ్ళి గురించి పెద్దగా ఆందోళన పడలేదు. తిని ఉమ్మేసిన కిళ్ళీలో ఏం రుచి చూసాడో ఈ నారాయణ అంటూ అక్కడక్కడ వాగేవాడు.

"డెబ్భైల్లో స్టేజీ నాటకాల ఊపు తగ్గింది. పావలాకో, బేడకో డిటెక్టివ్ డ్రామా లాడమనేవాళ్ళు. ఉన్న ఒకళ్ళిద్దరు రైటర్లు సినిమాల్లోకి వెళ్ళిపోయారు. నాటకశాలలన్నీ స్టోరురూములుగానో, మ్యారేజీ హాళ్ళుగానో మారిపోయాయి. మెల్లగా రేడియోలపై పడ్డాము. నాటకానికింత అని ఇచ్చే యాభై, వందా చెక్కులే బతుకుతెరువైనాయి. అయితే ఎర్ర త్రికోణం మీద, ఇరవై సూత్రాల పథకం పైనా రాయమని విసిగించే వాళ్ళు. నారాయణరావు కుదరదని మొండికేసాడు. కొన్నాళ్ళపాటు శ్రీరామనవమి పందిళ్ళలో నాటకాలు వేసాము వెయ్యో, రెండు వేలో పుచ్చుకొని. అయితే ఆ నాటకాల మధ్య చింతామణి బూతు సీన్లు ఆడాల్సి వచ్చేది.

"నారాయణరావుతో టీవీ సీరియల్‌కు స్క్రిప్టు రాయాలి రమ్మని కబురుపెట్టాడు శంకరం. తీరా వెళితే, 'ఒక డైరెక్టరు, వాడి పెళ్ళాం- ఒక రైటరు దాన్ని లేపుకుపోవడం!' అదీ థీమ్. 'మన కథ. దాన్ని రాయాలి నారాయణ,' అంటూ ఏడిపించేవాడు. చివరకు 'వ్యాపారబంధం' అనే సీరియల్‌కు స్క్రిప్టు రాయించేడు నారాయణ చేత. ఆరునెలలు తన దగ్గరే అట్టిపెట్టుకొని షూటింగ్‌నాడు ఇంకో రైటరును రంగంలోకి దింపేడు. 'నీ స్క్రిప్టు ఈ కాలానికి పనికిరాదోయి నారాయణ! గరం గరం మసాలా కావాలి టీవీలకు.

నీ స్క్రిప్టు చలిమంట కూడా పనికిరాదు!' అంటూ స్క్రిప్ట్ పై విస్కీ పోసి తగలబెట్టాడు. 'ఇది మాయతెరల కాలం. రంగు పెట్టెల కాలం. శంకరాల కాలం,' అని నేనూ, నారాయణ సరిపెట్టుకొన్నాం.

"ఇవాళ్టికివాళ కారులో 'ఏఐఆర్' దాకా డ్రాప్ చేస్తానన్న శంకరం, 'నాతో వుండిపో! తింటున్న పండును నోటిదగ్గర నుంచి లాక్కుపోయాడా నారాయణ! నన్నుంచుకుంటే నిన్ను గొప్ప టీవీ స్టార్‌ని చేస్తాను. నిన్ను పెట్టి 'తార' సీరియల్ తెలుగులో తీస్తాను!' అంటూ విసిగించేడు.

"కీచకుడు, దుర్యోధనుల సాంఘిక రూపం, ఈ శంకరం! నాయకుడు లేని నాటకం అయి పోయింది బతుకు."

పూర్ణ ముగించేసరికి స్టూడియోలో వింత ఉద్వేగం రేగింది. నాటక రచయిత హరి బిగుసుకొని పోయాడు. ట్రాన్స్‌లోకి వెళ్ళినవాడిలా మాట్లాడడం మొదలుపెట్టాడు.

"ఆంధ్రా యూనివర్సిటీ ప్రొడక్టును నేను. బి.ఆర్. దగ్గర, ఎ.ఆర్.కె.ల దగ్గర పెరిగినవాణ్ణి. కొత్తల్లో చెహోవ్, ఇబ్సన్‌లు రాసిన నాటకాల్ని అనుసరించి స్టేజిపై ఆడాను. ఇవేం నాటకాలని జనం పెదవి విరిచేరు. రిత్విక్ ఘటక్‌లాగా, బాదల్ సర్కార్‌లాగా బెంగాలీ నాటకాలు కొన్నాళ్ళు ట్రై చేసాను. అవీ క్లిక్ అవలేదు.

"ఆరోజుల్లో యూనివర్సిటీలో ఒక విషాదం జరిగింది. ఆనందం అనే రీసెర్చి స్కాలర్ సూసైడ్ చేసుకొని చచ్చిపోయాడు. వాడు చిన్నా చితకా నాటకాలు రాసాడని, వాడి జ్ఞాపకార్థం ఒక నాటకం వెయ్యాలని అందరం అనుకున్నాం. నాటకం రాసే పని నాకే అప్పగించారు. 'వాడో గొప్ప డాన్ జువాన్! వాడి లైఫ్ మీదే నాటకం రాయమని బి.ఆర్. అన్నాడు. వాడి డైరీలో అడ్రసులు వెతుక్కొని ఊరి మీద పడ్డాను.

"రాణి అనే నర్సు కె.జి.హెచ్.లో కాన్పుల వార్డులో దొరికింది. 'ముందో మూడొందలు పట్రా! హోటల్లో కూర్చుని మాట్లాడుకుందాం!' అన్నదా నర్సు. 'గురుడు నన్ను అన్యాయం చేసేడు. నన్ను హీరోయిన్‌గా పెట్టి నాటకం ఆడతానని చెప్పేవాడు. గొప్ప స్పార్కు వున్నవాడు! పైకి రావాల్సినవాడు!' అంటూ కంటతడి పెట్టుకుంది హోటల్లో. క్వార్టరు బాటిల్ లాగించినాక, 'ఇంకేం అడక్కు! మనసు చెదిరిపోయింది!' అంటూ హోటల్ బయటకు వచ్చింది. 'ఆటో మాట్లాడి నన్ను ఎక్కించు,' అని గొడవ చేసి వెడుతూ వెడుతూ, 'ఆనందం చనిపోవడానికి రెండు రోజుల ముందు యాభై స్లీపింగ్ పిల్స్ నేనే ఇచ్చాను!' అంటూ మిస్చివస్‌గా నవ్వుతూ వెళ్ళిపోయింది.

"ఇంకో అడ్రసు రమాదేవి అనే లాయరుది. రైటరు కదా అని ఇంట్లోకి రానిచ్చాను. కంపెనీల్లో ఆడోళ్ళతో ఇతనికి సంబంధాలుండేవి. వాళ్ళకు బెయిల్ కావాలని నా చుట్టూ

తిరిగేవాడు. ఒకసారి ఈ ఆనందం, ఫుల్‌గా తాగి ఒక కంపెనీ పిల్ల గొంతు పిసికి చంపేసాడు. పోలీసులు తీసుకెళ్ళి జైల్లో వేసి కుళ్ళబొడిచారు. చచ్చీచెడీ యాభైవేలు కట్టి బెయిల్ మీద బయటకు తెచ్చాను. బయటకు వచ్చిన రెండు రోజులకే సూసైడ్ చేసుకొని చచ్చిపోయాడు,' అంటూ లాయరమ్మ చెప్పింది.

"ఈ సంగతులన్నీ నాటకంగా రాసాను. మొదటిసారి యూనివర్సిటీలో వేసాను. 'రెండు రూపాలు' దాని పేరు. ఉత్తమ ప్రదర్శనగా బహుమతి వచ్చింది. ఆ తరువాత వరుసగా విజయనగరం, బరంపురం, కాకినాడల్లో కూడా ప్రైజులు తెచ్చుకుందీ నాటకం.

"ఒక సాయంకాలం పూట మసక వెలుతుర్లో ఒక సన్నకారు మనిషి హాస్టల్లో నా గదికి వచ్చేడు. 'నీ నాటకాన్ని నాకివ్వు! కంపెనీ పెట్టుకొని నాలుగుచోట్ల ఆడు కుంటాను!' అన్నాడు. వెలుతురులో ఆ మనిషి ముఖం చూసి కొయ్యబారిపోయాను. ఆ మనిషి ఆనందం!"

స్టూడియోలో వున్న అందరూ క్షణంపాటు ఉలిక్కిపడ్డారు.

"అబ్సర్డ్ డ్రామా విన్నట్లు వుంది కదూ! కాని నిజంగా జరిగిందే!" అన్నాడు హరి కుర్చీలో రిలాక్స్ అవుతూ. క్షణాల్లో హరి ముఖం బిగుసుకుపోయింది. ముఖం ఎర్రగా మారిపోయింది. "జీవితం అంతా ఈ ఆనందానికి నీడగానే మిగిలిపొయ్యాను. సింద్‌బాద్ దెయ్యంలా వీడు నన్ను అప్పటి నుండి వదలలేదు. చౌకబారు నాటకాలెన్నో నా చేత రాయించేడు. రాసిన నాలుగు మంచి నాటకాలు వాడి పేరు మీద దేశం పైకి వదిలాడు. రైటరుగా, డైరెక్టరుగా పేరు వాడికి. 'ఒరే ఘోస్టూ!' అనే పిలుపు నాకు. ఇవాళ ఈ ఆనందం ఎడాపెడా టీవీ సీరియల్స్ లాగించేస్తున్నాడు. కథ, టెలిప్లే, దర్శకత్వం వాడి పేరు, వాటి వెనక ఘోస్టు రైటరుగా నేను.

"అంతేనా? వీడు తెగ తిరిగి వదిలేసిన లాయరమ్మను నాకిచ్చి పెళ్ళి చేసాడు. ఆమెను దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టుకుందామని ముందుకు వంగితే ఆమె కళ్ళలో ఈ ఆనందంగాడి బొమ్మ. ఘోస్ట్ రైటర్నే కాదు, ఘోస్టు హస్బెండును కూడా."

హరి కళ్ళలో రక్తమూ, కన్నీళ్ళూనూ. హరిని కళ్ళతోనే ఓదార్చి మూడోమనిషి శివయ్య వైపు చూసింది మాధవి, గొంతు విప్పమని అభ్యర్థిస్తూ.

"గోత్రాలు చెప్పుతూ ఇళ్ళ వెంబడి తిరిగే పిచ్చుకుంటల కుటుంబంలో పుట్టినవాణ్ణి. మా పూర్వులు డక్కీల్ని, తంబురాల్ని వేసుకొని ఊళ్ళ వెంట తిరిగేవాళ్ళు. మా జేజినాయన బుర్రకథలు కూడా చెప్పేవాడు. 'ఇది కళా? అడుక్కుతినడం కాదూ?' అని మా నాయన ఈ బతుక్కి 'ఛీ' కొట్టాడు. ఇంట్లో ఉన్న తంబురానీ, తోలుతిత్తినీ ఇంటి ముందర పరిచి నిప్పు పెట్టాడు. మనిషి అంత ఎత్తుకు లేచిన ఆ మంటల్లోంచి పాటలేవో లేచి వచ్చి నా చుట్టూ తిరుగుతున్నట్లుగా అనిపించేది. నా గుండెల్లో 'డక్కీ' ఒకటి ధమధమ మోగుతున్నట్లుగా వుండేది.

"మా నాయన నన్ను బడికి పంపేడు. క్రిస్టియన్ల బడి అది. నా మాట, యాస వెక్కిరింతగా చూసేవాళ్ళు బడిలో. ఎందుకనో ఆ ఇంగ్లీషు ముక్కలు నా నాలుకపై నిలవలేదు. బేముబెత్తంతో ఫాదిరీ అయ్యవారు ఎంతగా కొట్టినా నా నాలుక ఇంగ్లీషు మాటల్ని సరిగ్గా పలికేది కాదు. రైమ్సు, ప్రేయర్ అని ఏవో పాటలు పాడించేవాళ్ళు. దెయ్యాలు గొల్లున ఏడ్చినట్లుగా వుండేవా పాటలు. రాత్రిపూట హాస్టలు గది బయట కూర్చుని, అట్లా ఆకాశంలోకి చూస్తే, ఆకాశంలో పెద్ద మంట సుళ్ళు తిరుగుతూ కన బడేది. ఆ మంట క్రమంగా కిందికి దిగి, నా లోపలికి ప్రవేశించి, నాలో మూసుకుపోయిన గదుల్ని తగలబెడుతున్నట్లుగా వుండేది. నాకు తెలియకుండానే నా పూర్వీకుల పాటలు బయటకు తోసుకు వచ్చేవి.

"ఐదో తరగతి రెండుసార్లు తప్పాను. అట్లాగే ఏడో తరగతి. 'ఊళ్ళ వెంట తిరిగి అడుక్కునే జాతి! నీకీ నాగరికం భాష ఎట్లా వస్తుంది?' అంటూ ఫాదిరీ అయ్యవారు కోప్పడేవాడు. బడిలోంచి వెళ్ళిపొమ్మని తాఖీదు ఇచ్చారు. మా నాయన గొల్లుమన్నాడు. చివరకు నాకు మతం యిప్పించి, శామ్యూల్‌గా మార్చివేసారు అయ్యవార్లు. శివయ్యగా, శామ్యూల్‌గా రెండు జీవితాలు గడుపుతూ ఇరవయ్యో ఏట పదో తరగతి పూర్తి చేసాను.

"బడిలోనే అటెండరు ఉద్యోగం యిస్తానన్నాడు ఫాదిరీ అయ్యవారు. నా లోపల మండుతున్న మంటలు నన్ను ఒకచోట నిలవనీయలేదు. పల్లెలన్నీ తిరిగి చిట్టచివరి పిచ్చుకుంటల వారి ఇంటికి చేరాను. 'కథ' నేర్పమని ఏడ్చాను. పిచ్చుకుంటల వారు పాడే కథలు కాకుండా ఒగ్గు కథలు, దాసర్ల పాటలు, చిందు పాటలు, మిత్తులయ్యావార్ల పాటలు సమస్తమైన జానపద క్రియలన్నీ చెప్పాడు. తంబురా వేసుకొని పల్లెలపై పడ్డాను. 'వాడి పాటల్లో అగ్గి వుంది! మనల్ని నిలవనీయదు,' అనేవాళ్ళు జనం.

"ఆ నోట ఈ నోట పాకి నా పేరు దేశదేశాలకు పాకింది. రేడియోవాళ్ళు వచ్చారు. రికార్డింగ్ చేస్తామన్నారు. సరే అని పాడేను. నా గురించి పేపర్లలో కూడా రాసారు.

"ఒకరోజు ఆనందశంకరం అనే పెద్దమనిషి నన్ను కలిసాడు. 'రేడియోల్లో నీ పాటలు విన్నాను. ఏం గొప్పగా పాడేవు!' అని మెచ్చుకున్నాడు. 'రేడియోలో పాడితే ఏం లాభం! నీ పాటలు కేసెట్లలోకి ఎక్కితే దేశం అంతా వింటారు!' అంటూ ఆశ పెట్టాడు. సంవత్సరం కాంట్రాక్టుకు సంతకం పెట్టాను.

"కొంచెం నీచువాసన వేస్తోంది నీ భాష అంటూ పంతులుగార్ని పిలిచి పాటల్ని మళ్ళీ రాయించాడు. వందలుగా పాటలు పాడించుకొని, పదింటిని మాత్రం కేసెట్టుపై ఎక్కించాడు. కేసెట్లలో పాటలు చూసుకొంటే కొండ ఎక్కినంత సంబరంగా వుండేది. కేసెట్లు బాగా అమ్ముడయ్యాయి. ఇంక వెనక్కు చూడలేదు ఆనంద శంకరం. పది కేసెట్ల పైగా రికార్డు చేసాడు.

"ఆ కేసెట్లు మళ్ళీ మళ్ళీ వింటుంటే గుండెలు పిసికినట్లుగా వుండేది. నేను నేర్చుకున్నదేమిటి? ఈ కేసెట్లలో వున్నదేమిటి? నా పూర్వీకుల పాటల్లోని జీవం వీటిల్లో లేదు. 'నీ మాట శవమైపోను!' అనే తిట్టు వుండేది మా పల్లెల్లో. అట్లా నా పాటలన్నీ శవాలయిపోయినట్లుగా బాధ వేసేది. ఆ మనిషిని కాదనుకొని రికార్డింగ్ కంపెనీ నుంచి బయటకు వచ్చాను.

"ఒక కమ్యూనిస్టు అన్న కలిసాడు. 'నీ పాటలతో చాలా పని వుంది పద,' అంటూ పల్లెల్లోకి తీసుకెళ్ళాడు. అడవులకు దగ్గరలో ఒక మారుమూల పల్లెటూరు. పల్లె చివర పొలాల మధ్య రహస్యంగా వున్న పూరిపాక. అక్కడ కుర్రవాళ్ళకు పాటలు నేర్పాలి. మెరికల్లాంటి కుర్రాళ్ళు. పాటల్ని చప్పున అందుకునే వాళ్ళు. అప్పుడప్పుడూ మీటింగులకు వెంట బెట్టుకొని వెళ్ళేవాళ్ళు. శివయ్యన్న అంటూ నన్ను నెత్తిన పెట్టు కున్నారు వాళ్ళు!

"రహస్య జీవితం. అయితే మాత్రమేం, పువ్వులా చూసుకొన్నారు. టౌన్‌కెళ్ళి పేపరు తెచ్చి పెట్టేవాడో కుర్రవాడు. పొద్దున్నే కాఫీ, టిఫిన్. మధ్యాహ్నం అన్నం పట్టుకు వచ్చేది అన్న భార్య. పాటలన్నీ పుస్తకాల రూపంలో వచ్చాయి. నా గొంతు వందలాది వేలాది కేసెట్లుగా మారిపోయి దేశమంతా పాకింది.

"ఒక ఆదివారం, అన్న మీటింగుకు వెళ్ళిన వేళ, పాక దగ్గర అలికిడి అయింది. కొత్త ముఖం! 'అన్న పంపాడు రా!' అంటూ పిలిచాడు. పోలీస్‌స్టేషన్లో తేలాను. నరకం అంటే ఏమిటో చూపించారు.

"వారం తరువాత జైలుకు ఆనందశంకరం వచ్చాడు. 'అన్నా! ఎంత పని జరిగింది! లాయర్లను పెట్టిస్తాను, భయంలేదు! భయం లేదు!' అని నాటకాలు ఆడాడు. రెండు రోజుల తరువాత వచ్చి, 'లాయరు నీ పనిమీదే వున్నాడు. నువ్వు బయటకు రావడంతోటే నీకు రెడ్ కార్పెట్టు. వి ఛానల్‌వాళ్ళు నీ పాటలు వెయ్యాలని తిరుగుతున్నారు. ఈ అగ్రిమెంటు కాగితాలపై సంతకాలు పెట్టు!' అంటూ కాగితాలు బయటకు తీసాడు. ఈ ఆనందశంకరాల్ని ఇంకా నమ్మడమా? 'కుదరదు ఫో!' అన్నాను. కళ్ళల్లో నిప్పులు రాల్చాడు. 'డక్కీలు వాయించుకుంటూ పల్లెల్లో తిరిగే నీకింత పొగరా?' అని ఎగిరాడు. 'ఒక కథ చెబుతాను విను! వెనకటికి టిప్పు సుల్తాన్ పాలించే కాలంలో నీలాంటివాడే ఒక గాయకుడుండే వాడు. దర్బారుకొచ్చి ఒక పాట పాడు అని టిప్పు కబురు పంపాడు. గాయకుడు నీలాగే నీలిగాడు, దేవుడు కోసం తప్ప యింకెవరి కోసం పాడనని. టిప్పుకు ఒళ్ళు మండిపోయింది. వాడి నాలుక కోసి పారేసి, నీ దిక్కున్న దేవుడికి చెప్పుకో ఫో! అన్నాడు. ఆ కథ మళ్ళీ రిపీట్ చెయ్యాల్సిన పరిస్థితి తేకు!' అని బెదిరించి వెళ్ళేడు ఆనందశంకరం. ఆనందశంకరం బెదిరించినట్టుగానే జైలుగోడలపై రక్తం చిందింది! చచ్చిపోవాల్సింది. కోర్టులో ఎవరో పిటిషన్ వేస్తే, బయటకు వదిలారు. శవంలా బయటకు వచ్చాను."

శివయ్య కళ్ళు నిప్పుగుండాల్లా వున్నాయి. శరీరమంతా ఊగిపోతుంది. కోపం, దుఃఖం కలగలిపిన అగ్నికణంలా వున్నాడతను ఆ క్షణంలో.

మెల్లగా గొంతు సవరించుకొంది మాధవి- ఇక ఇప్పుడు నా కథ వినండి, అన్నట్లుగా. మంచు అడవుల మధ్య కుందేలు పిల్ల నడకలా మెత్తగా, మృదువుగా వుంది తన కంఠం.

"మా స్కూలు పక్కనే పెద్ద కాలువ పారుతుండేది. లోతుగా భయం గొలిపేలా వుండేదది. ఆ కాలువ నాలోని రహస్య స్వప్నాలకు సింబాలిక్‌గా వుండేది. ఎన్నోసార్లు బడి ఎగ్గొట్టి ఆ కాలువలో ఈత కొట్టడానికి వెళ్ళేదాన్ని. అప్పటికి నా వయసు ఎనిమిది. ఆ కాలువ ఒడ్డు జ్ఞాపకాలు, కవితా ఖండికల్లా ఇప్పటికీ నెమరు వేసుకుంటాను. ఆ కాలువ ఒడ్డున అప్పుడప్పుడు కనిపించే ఎరుకల కుటుంబాలను గమనించటం నాకెంతో యిష్టం. జీవితమంతా అట్లా ప్రయాణిస్తూనే వుంటారు. ఇల్లు అనే చెరసాలలు నిరసించేవాళ్ళను చూస్తే నాకెంతో ఆశ్చర్యం. ఎక్కడ కావాలనుకుంటే, అక్కడ కావడి దించుకొని, వస్తువులు పరుచుకొని ఒక జీవితాన్ని ప్రారంభిస్తారు. రెండు రాళ్ళు పెట్టి చితుకులు ముట్టించి వంట మొదలుపెడతారు. ఉడతనో, కాకిపిల్లనో చంపి, వాటి మృదువైన మాంసాన్ని ముక్కలుగా చేసి ఉడక బెడతారు. వాళ్ళ వంటల్లో పెద్దగా దినుసులుండవు. మనోహరంగా వుంటుందా వంటల వాసన. వాళ్ళుండే చోట మరో గొప్ప పరిమళం కూడా మనల్ని అకట్టుకుంటుంది. పాతకాలపు ట్రాన్సిస్టర్ రేడియో- వాళ్ళ నివాసం మధ్య అతిపెద్దగా మోగే దాని శబ్దాలు. బలంగా వీచే గాలికి ఆ శబ్దాలు చెదిరి, అర్థం కాని దేవతల భాషలా మన చుట్టూ అల్లుకుపోతుంది. మిలమిలలాడే నీటి పరుగు, ప్రయాణమే జీవిత మైన ఎరుకలు, వాళ్ళ వంటల మధురమైన వాసన, వాళ్ళ చుట్టూ ప్రవహించే రేడియో సవ్వడులు- మధురమైన ఆ పసితనపు జ్ఞాపకం నన్ను చాలా సంవత్సరాలు వెంటాడేది.

"నా సొంతానికి ఒక రేడియో వుంటే బావుండుననే కల నన్ను అప్పట్లో చాలా వేధించేది. మా యింట్లో పెద్ద ఫిలిప్స్ రేడియో వుండేది. కానీ దాన్నెవరూ పెట్టేవాళ్ళు కాదు. ఎవరికీ క్షణం తీరిక వుండేది కాదు. అమ్మ, అన్న, అక్కలందరూ టైలరింగ్ షాపులో పని చేస్తుంటారు. ఆ షాపు మాదే. సొంత షాపు కావటాన, దానికి పనిగంటలు అంటూ వుండేవి కావు. టకటకలాడే మిషన్లు, సూదులు, దారాలు, గుండీలు. ఆ షాపు నాకో పీడకల. ఆ షాపులో వున్నంతసేపూ చిరునవ్వు, సంతోషం చెరిపి వేసుకొని, తోలుబొమ్మల్లా మిషన్లకు వేలాడుతుంటారు వాళ్ళు. ఇనుప కాళ్ళు, సూదుల లాంటి చేతులు, దారపు కండెల లాంటి కళ్ళతో దెయ్యపు బొమ్మలా ఆ షాపు చాన్నాళ్ళపాటు నా కలల్లోకి వచ్చి నన్ను భయపెట్టేది.

"నాకు పన్నెండేళ్ళప్పుడు, మా అమ్మకు పెరాలిసిస్ వచ్చింది. రాయవెల్లూరు తీసుకువెళ్ళమని డాక్టర్లు చెప్పారు. ఒక దిగులు మేఘం మా యింటి పైన ముసిరింది. రాయవెల్లూరు వెళ్ళడానికి ముందురోజు, ఇంట్లో ఎక్కడా కన్నీటిచుక్క కనబడకూడదని నాన్న ఆర్డర్ వేసాడు. అందరూ ఉత్సాహంగా ఉండి అమ్మలో ఆశను వెలిగించమని చెప్పాడు. ఆ రాత్రి నాన్న అమ్మకో చిన్న కానుక ఇచ్చాడు. అందంగా వున్న చిన్న పాకెట్ రేడియో. అలాంటి బరువైన వాతావరణంలో కూడా రేడియోని చూసి నేను చాలా ముచ్చటపడ్డాను.

"రాయవెల్లూరు నుండీ అమ్మ తిరిగి వచ్చింది. శరీరంలో కొంత భాగానికే జీవం వచ్చింది. కుడికాలు నిర్జీవంగా వేలాడుతూ వుండేది. కుడికాలులోనేకాదు, అమ్మ ముఖంలో కూడా జీవకళ వెళ్ళిపోయింది. వెనుక గదిలో ఎప్పుడూ దిగులుగా పడుకొని వుండేది. పక్కనే రేడియో గురగురమంటూ వుండేది. అందులో ప్రోగ్రాములన్నీ ఎప్పుడూ ఊసురోమన్నట్లుగా వుండేవి. అదీ వినపడీ వినపడని స్వరంలో. దుర్భరమైన గోలలా వుండేది. అమ్మ ఎప్పుడైనా నిద్రపోతుందేమో ఆ సమయంలో 'వివిధభారతి' పెట్టుకుని రెండు మూడు పాటలు వినాలనిపించేది. అమ్మ నిద్రపొయ్యేది కాదు. నిద్రకూ మెలకువకు మధ్య నిర్లిప్తమైన సమాధిలాంటి దశలో అట్లాగే పడుకొని వుండేది.

"డిగ్రీ చదివే రోజుల్లో ఇంటి పరిస్థితి దుర్భరంగా మారింది. షాపు మూతబడింది. బట్టల కొట్టులో గుమాస్తాగా మారాడు నాన్న. ఇంటి చుట్టూ అప్పులవాళ్ళు. చేతిలో పైసా కూడా వుండేది కాదు. అట్లాగే కొన్నాళ్ళు వుంటే అందరం ఆకలితో చచ్చిపోతామని పించేది. ఆకలితో మనిషి రూపురేఖలు కూడా మారిపోతాయి కాబోలు! మా నాన్న ముఖంపై చర్మం ఊడిపోయి జంతువు పోలికలు బయటపడ్డాయి. మా అక్కను పెళ్ళి పేరిట ముసలి జమీందారుకు అమ్మివేశాడు. మా షాపు మళ్ళీ మాకు వచ్చింది. ఇంట్లో అన్ని వస్తువులూ వచ్చాయి. బీరువాలు, టేప్ రికార్డరు, సోఫాసెట్లు వచ్చాయి. ఇంట్లో అక్క పోలికలున్న ఒక శవం నడుస్తున్నట్లుగా వుండేది. ఒకసారి అక్క ఇంటికి వెళ్ళాను. కిలోమీటరు నిడివి వున్న బంగళా. పెచ్చులూడిపోయి, మొజాయిక్ పగిలిపోయి, సోఫాలు పిగిలిపోయి, షాండ్లియర్ల బూజు వేలాడుతూ వుంది. అక్క, ముసలి అత్త, మీసాల జమిందారు, ఇద్దరు పనివాళ్ళు మాత్రమే. బావ అక్కను వదిలేసి సిటీలో కాపురం వుంటున్నాడట. అతనిక ఎప్పటికీ రాడు. అక్క ఒక్కతే తలుపులు మూసుకొని రోజంతా పడుకొని వుంటుంది. అక్క గదిలోనూ ఒక రేడియో వుంది. అందులో సంగీత కచేరి నిత్యం వినిపిస్తూ వుండేది. అది చెవులకు, ఆత్మకూ భరింపలేని హింసలా వుండేది. అట్లా ఇరవైనాలుగు గంటలూ కచేరీని ప్రసారం చేసే స్టేషను ఏదో నాకిప్పటికీ తెలియలేదు.

"నేను రేడియోల్లో చేరిన కొత్తలో ఈ కచేరీల తీరును మార్చవలసిందని ఒక రిపోర్టు తయారుచేసి డైరెక్టరుకు పంపించాను. చాలారోజుల వరకూ సమాధానం లేదు. సర్వీసు రిజిస్టరులో నాకో ఎర్ర ఎంట్రీ పడిందని తర్వాత తెలిసింది.

"టీవీలు వచ్చినా, రేడియో ఇంతలోకి అంతరించిపోదని నాకో పిచ్చి నమ్మకం వుండేది. పల్లెలు, కుగ్రామాలు, వెలుతురు సోకని చీకటి ఖండాలు, వాటికి రేడియో శబ్దాల అవసరం ఇంకా వుందనే నా ధైర్యం.

"ఫ్రెక్స్‌గా నా మొదటి ప్రాజెక్టు సంచార జాతుల జీవనం పైనే. ట్రైబల్ పిల్లలకు పాఠాలు తయారుచేసే ప్రాజెక్టు అది. ఆ రోజుల్లో జరిగిన ఒక వింత సంఘటన నాకిప్పటికీ గుర్తు! కొండ చివర్న వున్న చిట్టడవిలో నెమళ్ళ గుంపును చూద్దామని మా టీమ్‌లో అందరం, లోకల్ ట్రైబల్ కుర్రవాళ్ళతో కలిసి బయలుదేరాం. అలికిడి అవకుండా కొండ చాటు నుండి మెల్లమెల్లగా పాకుతూ కొండ పైకి వెళ్ళాము. హఠాత్తుగా భయం గొలిపే దృశ్యం! వందలుగా రాబందులు ఆ ప్రదేశంలో ఎగురుతూ కనబడ్డాయి. నెమళ్ళ ఆచూకీ లేదు. ఆ రాబందులు మా తలలపై నుండి గిరికీలు కొడుతూ ఎగరటం మొదలుపెట్టాయి. భయంతో వణికిపోయాం. ప్రాణాలరచేత పెట్టుకుని అక్కడ నుండి బయటపడ్డాం. ఆ సంఘటనకు నా జీవితానికి ఏదో సింబాలిక్ రిలేషన్ వున్నట్లని పించింది.

"ఎ.ఎస్. టీవీ అనే తెలుగు ప్రైవేట్ ఛానల్ ఇప్పుడు ఆంధ్ర దేశాన్ని ఒక ఊపు ఊపుతోంది. క్రియేటివిటీ వున్న ఆర్టిస్టులను డబ్బుకు ఖరీదు చేస్తున్నాడు ఎ.ఎస్. రావు, దాని ప్రొప్రైటరు. పత్రికల నుండి, రేడియోల నుండి ఆర్టిస్టులు అటువైపుకు వలస పోతున్నారు. 'పాతిక వేలు జీతం ఇస్తాను. నా టీవీలో ప్రోగ్రామ్ మేనేజరుగా చేరు,' అంటూ కబురుపెట్టాడు ఎ.ఎస్. రావు. మృదువుగా తిరస్కరించాను. వారం క్రితం నాకు 'సిక్కిం' రేడియో స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్టు ఆర్డరు వచ్చింది. ఆరునెలల క్రితం నేను ప్రసారం చేసిన 'స్కాముల భారతం' అనే నాటకం, ప్రభుత్వ పాలసీలకు వ్యతిరేకంగా వుందని, కాండక్టు రూల్సు ప్రకారం నా పై చర్య తీసుకుని, నన్ను రివర్టు చేసి సిక్కింకు ట్రాన్స్‌ఫర్ చేసారు. ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వచ్చిన గంటలోపలే ఎ.ఎస్. రావు దగ్గర నుండి ఫోన్ వచ్చింది. ప్రోగ్రామ్ మేనేజర్ పోస్టు నాకోసం ఇంకా ఖాళీగా వుందని. ఛీకొట్టాను వాణ్ణి. రేడియోలో నా ఉద్యోగానికి రాజీనామా పంపాను.

"నెమళ్ళ అడవులన్నీ అంతరించిపోయాయి! అంతటా రాబందులే ఎగురు తున్నాయి!" అంటూ ముగించింది మాధవి.

హఠాత్తుగా నిశ్శబ్దం. గడియారంలో యాభై నిమిషాలు చూపిస్తోంది. నాటకం ముగియడానికి ఇంకో పది నిముషాలుంది. ఎవరైనా ఏదైనా మాట్లాడండి అంటూ

సైగ చేసింది మాధవి. వెలికితీయాల్సిన జ్ఞాపకాలన్నీ అయిపోయినట్లుగా ఖాళీగా, వెలితిగా అయిపోయారు అందరూ.

పూర్ణమాణిక్యం గొంతు విప్పింది. "చిన్న స్పేస్‌ఫిల్లింగ్‌లాంటి ముచ్చట. ఉదయం శంకరంతో పాటు కారులో ప్రయాణిస్తుండగా స్టీరియో బాక్స్ పక్కన ఒక దంతపు పెట్టె చూసాను. ముచ్చటగా, అందంగా వుంది. 'చాలా బాగుంది, నాకివ్వవా?' అన్నాను. శంకరం కంగారుపడ్డాడు. 'గోల్డేమయినా దాచాడేమో? ఎరక్క అడిగానే?' అని దిగులుపడ్డాను. శంకరం సర్దుకొని, 'కావాలంటే తీసుకో, ఒక షరతు! దాన్ని ఎప్పుడూ తెరవకూడదు!' అంటూ దంతపు పెట్టె నా పర్సులో వేశాడు. స్టూడియోలోకి వచ్చినాక లాంజ్‌లో వెయిట్ చేస్తుండగా టెన్షన్ ఆపుకోలేక, పెట్టె తెరిచాను. 'దేవుడా!' అంటూ భయంతో బిగుసుకుపోయాను. చేతివేళ్ళు, సన్ననివి పొడవైన నాజూకైన చేతివేళ్ళు. చేతి నుండి తెగ నరికినవి. కుళ్ళిపోయి, చర్మం గిడసబారి, నల్లగా కమిలిపోయి- భయం గొలిపేలా వున్న చేతివేళ్ళు. చటుక్కున మూసివేశాను," అంటూ పర్సులోంచి దంతపుపెట్టెను బయటకు తీసింది పూర్ణమాణిక్యం. తెరిచిన దంతపుపెట్టెలోని వేళ్ళను చూసి, కెవ్వున అరిచింది మాధవి.

"ఆ వేళ్ళు ఎవరివి?" ఆసక్తిగా అడిగాడు హరి.

నిశ్శబ్దాన్ని చీల్చుకొని, ఎక్కడో ఆకాశం నుండి వినిపిస్తున్న మాటల్లా, "ఆ చేతి వేళ్ళు నావే!" అని వినబడింది. శివయ్య మాటలవి. లాల్చీజేబులో దాచుకున్న కుడిచేతిని పైకి తీసాడు. మొండిగా భయం గొలిపేలా వుందా చెయ్యి. క్షణకాలంపాటు స్టూడియోలో వున్న ముగ్గురు వ్యక్తులు కొయ్యబారిపోయారు.

'టంగ్' మంటూ గంట కొట్టింది గడియారంలో. వ్యవధి అయిపోయినట్లుగా మాధవి పైకి లేచింది. ముఖంలోని భావాల్ని తుడిచేసుకొని మెకానికల్‌గా మారిపోయింది. "థాంక్యూ ఫర్ ది ప్లే! మీ చెక్కులు రడీగా వున్నాయి! రిసెప్షనిస్టును కలవండి!" అంటూ బయటకు నడిచింది.

బయటకు వస్తూ, ఎందుకో తన చేతివేళ్ళ వైపు చూసుకొంది మాధవి. 'ఇవి మాత్రం ఖండితాలు కావా?' అనుకొంటూ బరువుగా నిట్టూర్చింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 10 ఆగస్టు 1997*
*కథ 1997*